

# హరిదాసు

రమణారెడ్డి

మరేమీ లేదు-ముందుగానే మనవి చేసుకుంటే యెందుకైనా మంచిది: యిది 'అరవపటం' కాదు. సినీమాల కథాంశాన్ని చేర్పు, కూర్పు, మార్పులు చేసి, కత్తెరిక ప్రయోగించి, ఆతుకుల నతికి స్వకీయంగా మార్చుకుంటున్న ఘనులు తక్కువయ్యారా, అంటే, తక్కువేమిటి, టాల్‌స్టాయి కథ రాస్తే అది ఒక సినిమాగాను, న్యూథియేటర్సువాళ్లు పిక్చరు తీస్తే, దాన్ని ఒక నాటకంగాను, ఛెకవ్ మొపాసాల మూలాలను తెలుగుపేళ్ళతో మావి అని పేరు ప్రఖ్యాతులార్జించుకున్న గ్రంథచోరులు, నిజంగా సాహిత్యానికి అవసరాలయిన ప్రతిభా, వ్యుత్పత్తుల మాట బూదిచేసి, అక్షరాలాకాకున్నా భావాత్మకంగానైనా బ్రహ్మ పదార్థమైన సాహిత్యాన్ని జార వృత్తిలోకి - రంకుతనంలోకి - పడుపువృత్తిలోకి దిగదింపారు.

నాయనలారా, యిది - చాలమటుకు నేటి తెలుగు సాహిత్యపు (కథా, నాటికా సాహిత్యపు) అంతస్తు; మహారచయితల నిజాయితీ.

మనుచరిత్రలో పెద్దన గారు కుకవులను దూషిస్తూ, యిలాంటి గ్రంథచోరులను కొరత వెయ్యాలన్నారు; నేను వుప్పుపాతర వెయ్యాలంటాను. నేను గణ్ణాంగి వాణ్ణిసుమీ!

* * *

'జై రమా-రమణ-గోవిందో హరి!' అని గొంతు సవరించుకుని 'ఊ...అయ్యా!' అని ఆలాపన ప్రారంభించాడు - సిక కుమారుడూ, కవి కుమారుడూ, కాదు-మన యెల్లారెడ్డి. అందరూ ఎల్లాడ్డి అంటారు-హరిదాసు వృత్తినిబట్టి- ప్రవృత్తినిబట్టి యెవరిదాసుడో కథాంతాన తెలివిగల పాఠకులే వూహించుకుందురు గాక!

ఆయనది రాపూరు తాలూకా. అక్కడి జనం సైదాపురం రాచిప్పలు బావుకోవేసిందేగాని సన్ననన్నము సున్న. అక్కడ వందయెకరాలు వున్నా ఒకటే, యిక్కడ అంటే-నెల్లూరు జిల్లా, కోవూరు తాలూకా, రేబాల గ్రామపరిసరాల్లో (రేబాల యీ కథకుడి ప్రస్తుత మకాం లెండి!) పదియెకరాలు వున్నా ఒకటే. పరాయి జిల్లాల మిత్రులు, మాది నెల్లూరు జిల్లా అనగానే, ఓహో గౌ॥ గోపాలరెడ్డిగారు అవతరించిన దివ్యమండలమా అని ఆశ్చర్యపడిపోయి, అంతా రెడ్డిరాజుల వరాలరాజ్యం గాబోలు ననుకుంటారు.

డిస్రేలీ పందొమ్మిదవ శతాబ్దపు కళ్ళకుగూడ, ఆంగ్లజాతి యేకంగా కనిపించలేదట; రెండు వర్గాలు, రెండు శిబిరాలు చీలికలుగా, యెదురెదురుగా, వుప్పునిప్పుకుమ్మదుమ్ముగా అవుపించాయట!

ఆ రాపూరు తాలూకాలో,మళ్ళీ అననివ్వండి, సన్ననన్నము సున్న. కాని ఎల్లారెడ్డి వంటి వాళ్ళకేసుమండీ ఆశ్రీకారం;శ్రీమంతులు ఆరావళీ పర్వతగుహల్లో, ఒంటిస్తంభం మేడలమీద, సహారా యెడారిలో ఉన్నా ఒకటే; మిసిసిపీ, గంగ,గోదావరి,పినాకిని నదుల సాగుబడి భూముల్లో వున్నా ఒకటే: తాలూకా తాలూకా మధ్య ధాన్యపురవాణా నిషేధం, ఎల్లారెడ్డి వంటి దుర్జనులకే అన్వయమవుతుంది.

సరే, ఎంత పాతవయినా, వేమన్న పద్యాలకు మల్లే, వూరగాయలకుమల్లే, దరిద్రుడికి గంపెడు సంసార మన్నది నిత్యనూతనంగా వుంటుంది. కనుకనే జానపదప్రవచనాలలో నిజమైన, నిస్తులమైన కవిత్వం అంతర్వాహినిగా, మన బహిరింద్రియాలకు అగోచరమయినా, అంతరాంతరాలకు ఒడ్డులుతన్ని వురకలెత్తి పారుతోంది.

మన కుచేలుడున్నాడు- పిడికెడు అటుకుల కోసం మొహంవాచినవాడూ, హరిభక్తుడున్నూ. కాని ఎల్లారెడ్డి, కస్తూరికట్టిన గుడ్డకొంగు- పడిపోయిన రెడ్డిరాజ్యపు ఆఖరు ప్రతిధ్వని కనుక- మల్లుగుడ్డలు కట్టించి మూడు వుగాదులు దాటిపోయినా, యింకా జాగ్రత్తగా, పదిలంగా వాడుకుంటూవుంటున్నాడు. ఇంటిదగ్గర వున్నప్పుడు మాత్రం, మోకాళ్ళవరకూ పంచెకట్టి, అప్పుడప్పుడూ పెళ్లాం రామమ్మకు పుట్టింటివాళ్లు పెట్టిన గ్లాస్కో చీరెలో అంచువచ్చేటట్లు చింపి, పైన కండువా వేసుకుని తిరిగేవాడు. అంటే, యిప్పటికి కుచేలుడు, నలుడు అయ్యాడు—ఎందుకు కావలసివచ్చింది? గౌరవంగా పదుగురిలో తనూ ఒకడని యేవెలితీ లేకుండా తలెత్తుకొని తిరగాలి.

ఈ పురాణపురుషుడికి కొద్దిగా పాడడం వచ్చు—కంఠస్వరం సదా మందరం. చిన్నప్పుడు పల్లెమస్తాను నేర్పించిన పండరి భజనలలో రాటుదేరిన గొంతు రాపూరు షుమారైన కూడలే కనుక ఏ పార్టీవాళ్లయినా సరే వచ్చి మీటింగులు పెట్టినప్పుడు, ఎల్లారెడ్డి తప్పక వుండవలసిందే! ఏ పెళ్ళిలోగానీ, పేరంటంలోగానీ ఎల్లారెడ్డి పాటకచేరీ తప్పనిసరిగా కార్యక్రమణికలో జనప్రియమైన అంశంగా వుండి తీరవలసిందే! ఇక పులిపాటి, సూరిబాబు,బందా నాటకాల విజృంభణంలో, నేలకుపోయి ముసుగు వేసుకుని కూర్చున్నప్పటికీ, రాగాల విషయం- ముఖ్యంగా బందా పద్యంలో ఒక చరణం పాడి, మధ్యలో నిలిపి, వచనం చదివి, తిరిగి పద్యమెత్తుకోవడం బాగా తెలిసిపోయింది. క్రమంగా నాటకం ఆడించే కంట్రాక్టర్లు మచ్చికఅయ్యారు. ఆపనీ యీపనీ చెయ్యడం, ‘పరాబ్రహ్మ !’ చదివే లోపల సైడ్ కర్టన్ దగ్గర చేరుకోవడం పరిపాటి అయింది. కాస్తో కూస్తో చదువుకున్నాడు కనక కొన్నిసార్లు ప్రాంప్టరుగా వున్నాడు; ఒకసారి నిడుముక్కుల సుబ్బారావుగారు వేంచేసిన సావిత్రి నాటకంలో, యమభటుడుగా కూడ రంగు పూసుకుని, గగ్గయ్యను అనుకరిస్తూ ఒక పద్యపుచరణం చదివినందుకు, తర్వాత సావిత్రి పాత్ర ధరించిన ఋష్యేంద్రమణి చెప్పినదాన్ని బట్టి ఆమెకే భయం వేసిందట. అప్పటినుంచీ రెడ్లకు ఎల్లారెడ్డి ఒక వంశగౌరవ మయ్యాడు. అంతటి పాటగాడు పుట్టలేదన్నారు. త్రిపురనేని కవిరాజుగారి వుద్యమం యీ నెల్లూరు భూస్వామిక గ్రామాలకు ప్రాకలేదుగాని, ప్రాకినంత పనిమాత్రం అయింది: “ఆ బేపణనాయాళ్ళకే నంటరా తెలిసేది, మన యెల్లాడ్డి కూడ హరికథ చెప్తాడు! సాంబమూర్తి రోజుకి నూటేభై రూపాయ లడిగితే, యీతేప వొచ్చిన దార్నే పొమ్మందాం. అదే మన కులపోడు యెల్లాడ్డికి రోజుకి పదిరూపాయలు దండిగా సాలు. వాడు తెలివిగల్లోడు,ఆశాత్రపోడు గాదు.రామాయణం కంటతా పెడతుండాడంట, పదేనురోజుల్లో కాళీ చేయొచ్చంట; యీ వూళ్లోనే తలా తూమెడు వడ్లు, రెండు రూపాయలు, ఒక రాత్తిరికి అన్నం యిస్తేసరి, బంగారంగా చెప్పాకుంటాడు, బతికిపోతాడు” అన్నాడు దిబ్బారెడ్డి సుబ్బారెడ్డి.

ఈ అపాయంలేని వృత్తిలోకి దిగాడు ఎల్లారెడ్డి. ఇంతవరకూ హరికథా పారాయణం బ్రాహ్మణోత్తములే, అర్థం కాకపోతే, బేపన నాయాళ్ళే చెప్పుతూ వచ్చారు. కాని ఆదేమి ఖర్మమో, వాళ్లు దేనిలో కాలు పెట్టినప్పటికీ, స్వవర్ణస్థులే పోటీపడేవాళ్లు. ఒకనాడు ఏకచ్ఛత్రంగా అగ్రహారాలు పరిపాలించిన ధర్మదాతలు ఆఖరుకు వెర్రివాళ్ళయ్యారు. వీళ్లవద్ద తలమనిషిగా ముప్పందుము జీతానికి పనిచేసిన రెడ్డిగాడి యింటికే యీవేళ మజ్జిగకూ, వంకాయలకూ పోతారు. వీళ్లదృష్టిలోనే దోష ముందని,పచ్చటి తోటల్లోకిగానీ, వడ్లరాసిదగ్గరకు గానీ రెడ్లు చేరనియ్యరు. ప్రస్తుతం బ్రాహ్మణుల దురవస్థకు వున్న కారణాలలో ముఖ్యమైనది, అడిగినదంతా పెట్టగల భూదేవిని నిర్లక్ష్యం చెయ్యడమే. భోజనప్రియులని పేరుమోసిన యీ కులంలో- పదియెకరాల పసిడిపొలం వున్న కుటుంబంలో-

సాకు తెలిసినమట్టుకు, నెయ్యి నూనెలకోసం చాల ఖర్చుఅవుతుంటుంది. హిందువులు సాధారణంగా సాహెబులను వేళాకోళంచేస్తూ, వాళ్ల ఖర్చును గురించి-'వుంటే నవాబు, లేకపోతే ఫకీరు' అంటారు. అదేవిధంగా బ్రాహ్మణులు కూడ, వుంటే దర్జా, లేకపోతే ముష్టి—ముష్టిలోనూ, పాతవాసన విడక, దర్జాముష్టి-ధగిడీ ముష్టిన్నీ! భూమిని నిర్లక్ష్యంచేసి వాళ్ళు దుర్వృత్తిలోకి దిగలేదు— విద్యకోసం, తిండికోసం 'బ్రాహ్మణ వ్యవసాయం' చేసి సారం తెలిసికోలేకపోయ్యారు; విద్యావంతుల సంఖ్య పెరిగింది; కమ్యూనల్ జీ.ఓ. ఒకటి దాపురించింది; ఇలాంటి పరాశ్రయాలయిన, శుష్కనష్టమయిన, బహిష్కరణోచితములయిన వృత్తులు ప్రజల మాధ్యం మీద పుట్టి పెరిగాయి—సాగుతూనే వున్నవి.

* * *

రెడ్డి కాబట్టి, మన యెల్లారెడ్డి, రెడ్లు బలిసిన వూళ్లలో సంచారకార్యక్రమంవేసుకుని ధర్మబోధ చేసి, యింటికి కొంత డబ్బు పంపి, చాలమట్టుకు అన్ని వూళ్ళలోనూ యిలాంటి భాగవతోత్తముల రాకను పురస్కరించుకుని శుశ్రూషచేసి తారక మంత్రోపదేశంకోసం చకోరాలకుమల్లే వేచి వున్న పూర్వసువాసినులకు మంత్రం వుపదేశించి, షడ్రసోపేతంగా భోంచేసి, మరీ తరలేవాడు. రెడ్లకు గౌరవ చిహ్నలయిన బంగారు మెడల్సు పదమూడు యీ వేళటికి ఎల్లారెడ్డి విశాలవక్షంలో కౌస్తుభమణి మాలలాగ, పెట్రోమాక్సు లైటు కాంతిలో, ధగద్ధగాయమానమవుతుంటే మగవాళ్ళ కంటికి కనుపడని మగువలు, అసూర్యంపశ్యలు, కిటికీకమ్మల వెనకవున్న లతాంగులు, తులసిగుబురు మూల చాపపరుచుకుని కూచున్న అబలలు- ఆహాహా, యేమి ఆనందిస్తారు!

సుందరకాండం కథ...పొట్టివాడు, తెల్లటివాడు, ఎదబలిసినవాడు, పొట్టలేనివాడు, రోమపుష్టికలవాడు, నడుముకు ఖద్దరు శాలువా హంగుగా చుట్టినవాడు, మెడలో మెడల్సుకు పైన కస్తూరిపట్టెల మాల వేసుకున్నవాడూ, చేతికి పూలచెండ తగిలించుకున్నవాడు, భాగవతోత్తముడూ, 'ఆహాఁ!' అని గొంతు సవరించితే చాలు, పక్కన తబలా బడేసాయెబు, హార్మణీ సుబ్బరాముడూ (ఎల్లారెడ్డి ట్రూపులెండి!) అరణ్యమధ్యంలోకయినా వెంబడించే అథాటు (అంటే అథారిటీ) చలాయించగలవాడూ అయిన ఎల్లారెడ్డి ప్రవేశించుచున్నాడు....

నిన్ననే దాసరివాళ్ళు పెద కాపమ్మ కథ చెప్పారు. బండవాళ్ళ ఆరవల్లి చూరవల్లి తంగిడవల్లి కథ ప్రోగ్రాం ఐదురోజుల్లో జరుగుతుంది. అయినా హరికథల కంటేనా?

ఎల్లారెడ్డి దేవళపు ట్రస్టీ వెంగళ్రాయస్వామి రెడ్డిగారి యింటిలో తొలిపూట భోజనం చేశాడు. ఒంటెద్దుబండి దిగి నీళ్ళ చాయకు పోయి వచ్చేసరికి రాత్రి తొమ్మిదిగంటలయినందువల్ల, అప్పటికప్పుడు పొయిలో నిప్పు ముట్టించి ముగ్గురికి మూడు పావుశేర్ల అన్నం వార్చే ఓపిక ఆడవాళ్ళకు లేనందువల్ల, అన్నంలో నీళ్లుపోసి వున్నందువల్ల, ఎల్లారెడ్డి వంటివాడు పిండిన అన్నంలో మినుముల పచ్చడి కలుపుని తినవలసివచ్చింది. ఆయన ఆగమన వార్త ప్రాకిందేమో, దిబ్బలో రంగమ్మ, పొట్టి సీతమ్మా ఆదరాబాదరా వచ్చి ఆయనగారికన్నీ అమర్చి, మర్నాటికి యేమేమి వస్తువులు అవసరమో, అవి సేకరించ సాగారు.

* * *

కథ పట్టులో వుంది. లంకిణిని మరిపించి అశోకవనంలో దూరి ఆంజనేయులవారు సీతమ్మ కోసం నానా తంటాలూపడి విసిగివేసరి దప్పిగొని ఆకొని పొమ్మసిలి ముడుక్కుని చెట్టుగుబురులో కూచున్నారు. చెట్టుకింద ఎవర్తో శుష్కించిన ఆడది, చెదిరినముంగురులుకలది, ముఖంమీద చెమ్మట, అలిగివున్నది కనక ఆకలితో సతమత మవుతున్నదట— ఈమే సీతమ్మ వారని తెలుసుకున్నాడు ఆంజనేయులు. సీతమ్మచుట్టూ రాక్షసులు పహారా యిస్తున్నారు.

'ఆంజనేయులవారేంచేశారయా అంటే... రమారమణగోవిందో హరి!'

'హరి!' అన్నవి నాలుగు గొంతులు.

'మీకేం గొంతుల్లేవా? తూగుబోతు పెద్దమ్మల్లారా, మీ మాదిరిగానే వుండారు ఆ రాక్షసులు కూడ... ఓయి కుంభకర్ణుడా, మేల్కొనుము. వరసకి, కుంభకర్ణుడి ముక్కు రంధ్రాల్లో గడ్డి

మోపులు పడేసిన పెద్దబళ్ళుకూడ అలాయిలగా పోతయంట...'

'అహ్హాహ్హా...ఓహోహ్హో... అమ్మనాయినా యెంత ఆల్చ్యంరా రామచెంద్రా...' అన్నాడు మాలపోతిగాడు; వాడిగొంతు కంచుగంట; దేవాలయం అరుగుల వెలుపల వీధి మధ్యగా కూచున్న మాలమాదిగ యానాదివాళ్ళలో వాడే మాటిమాటికీ అరిచేవాడు...తలిమ్మావాళ్ళు కథలో పూర్తిగ పరవశులయి తాదాత్మ్యం చెందారు.

'మొదులు పెట్టండిరా... జై...'

'...రమారవణ గోయిందో హరి!'

'అద్దీపరస... "రామ రామా కోదండరామా

ఇడుగురామ పిడుగురామ
తుడియా కోదండరామ...
రాముడంటే రాముడా
రాజశేఖరుండయా
రగుపతి రాగవ రాజారాం
పతీతపావన సీతారాం..."

పలకండి.... చప్పట్లు కూడ... ఆయ్యా, అప్పుడా ఆంజనేయస్వామి ఆసీనురాలయి శుష్కవదనయయి దీనురాలయివున్న సీతామ్మవారిని చూసిన వాడయి, కిందికి లంఘించాడు– ఏవిధంగా నయా అంటే– తరనాంతాతరీనానాతరనాం....

'నారినన్న నారిననా నారినన్ననా

ననానాన నారినన్న నారినానననా'...కిందికి దూకిన చప్పుడుకి, త్రివక్ర యనేటటువుంటి, అంటే, మూడువంకరలు కలిగిన వికారవు శీద్రపు అసయపు రాక్షసి పుసికట్టిన కళ్ళు బలవంతంగా తెరిచి, ఆవులించి, దిగ్గనిలేచి, నేలను తాడించి, తుప్పుమని వుమ్మి, నడుములమీద చేతు లుంచి, మగరాయుడి మాదిరిగా రికునా నిలుచుని అన్నది: ఓరి ముచ్చా, ఎవడవురా నీవు? దశగ్రీవుని, అంటే పది తలకాయలుగల రావణబ్రహ్మ యేలేటటువంటి లంకారాజ్యంలో పది మంది మగ రాయుండ్రను చంపగల రాక్షస స్త్రీలు పనిమంది కాపలావున్న యీ అశోకవనంలోకి యెట్లు వచ్చితివిరా తులువా, పలువా, నీ మెడ తుంచి, రాగి సంగటిలో నంజుకుని తినెదను గాక!

"నిలు నిలు బాలక అడుగు కదల్పకు

కదలిన నీతల బద్దలవునురా!" ఆంజనేయులు సామాన్యులా...సామదానభేదదండోపాయములందు, మొదటిదానిని వుపయోగించ దలచి, సుందరయువకుని రూపమెత్తి, యేమన్నాడయా అంటే,

"చిలకా పలూక రాయే

ఎవు రే మన్నా రె నిన్నూ?" అని సరసాలాడి మచ్చిక చేసుకుని, సీతమ్మ వారిని సమీపించి, అమ్మా, నేను మీ పదదాసుండను, కిష్కింధాపురిలో వుంటున్న శ్రీరామచంద్రుడు లక్ష్మణసమేతుడు పంపగా ఆ భగవానుని పనుపున మీజాడ లరయ వచ్చిన వానరులలో నేనే విజయిని...అని ఆవేశం కొద్దీ చెప్పుకపోతుండగా, సీతమ్మ, యిది రాక్షసమాయ, ఇంద్రజాల మహేంద్రజాలవిద్యల దెలిసిన రావణుడి మాయ అని తలచి, ఓరీ, రాము డెటువంటివాడురా అనిన, ఆంజనేయులు, భక్తిపారవశ్యంబున–

నీలమేఘచ్ఛాయ బోలు దేహమువాడు
ధవళాబ్జపత్ర నేత్రములవాడు
కంబుసన్నిభమైన కంఠంబుగలవాడు
బాగైన యట్టి గుల్భములవాడు
తిన్ననై కనుపట్టు దీర్ఘబాహులవాడు
ఘనమైన దుందుభిస్వనమువాడు
పద్మరేఖలుగల్గు పదయుగంబులవాడు
చక్కని పీనవక్షంబువాడు

కపట మెఱుగని సత్యవాక్యములవాడు
రమణి! రాముండు శుభలక్షణములవాడు
ఇన్ని గుణములు రూపింప నెసగువాడు
వరుస సౌమిత్రి బంగారువన్నెవాడు ..అని

ఆంజనేయస్వామి వినమ్రుడై పలుకగా, సీతమ్మ రామచంద్రుని అంగుళీయకము చూచి, నిజమని నమ్మి, ఏమియుం దోచక పెద్దపెట్టున విలపించగా, ఆంజనేయులు సమీపించి, అమ్మా, మీరు భయపడవద్దు, యిదుగో, మీకుగన యిష్టమయిన పక్షంలో, నాభుజంమీద యెక్కించుకుని, ఒక్క వూపున సముద్రం లంఘించి, శ్రీరామచంద్రుల వారి పాదపద్మాలవద్ద వ్రాలగలవాడను.

చేర్చెదన్ శ్రీరమారమణుని
పాదపంకజ సన్నిధిన్,—

పరిమార్చెదన్ నాకడ్డు నిలిచిన
అసురగణముల నందఱన్,
ఎవడనో నా సత్త్వమెట్టిదో
ఎరుగవో ఓ జానకీ,
భానునిన్ ఫలమట్టులన్ నే
గోరికి తినగా చూచితిన్,
వానరాధిపు వాలియనుజుని
కొలువులో నేమంత్రి నే!...
కనక, జై...'

'రమారమణ గోవిందో హరి...యీ దినం సాల్లేవమ్మా యెల్లయ్యా...' అన్నాడు మాల పోతిగాడు...

* * *

బేస్తవారం పంచమి... ఈరోజు వుభయం పక్కిరెడ్డి బుజ్జమ్మగారిది. ఎల్లారెడ్డి ట్రూపుకు భోజనంకూడ అక్కడే. బుజ్జమ్మగారిల్లుఅని యెందుకంటారు, కోటిరెడ్డి వాళ్ళిల్లుఅని యెందుకనరు? కోటిరెడ్డి మగదిక్కుగదా అంటే, కోటిరెడ్డి యిల్లటం వచ్చాడు. కోటిరెడ్డిదికూడ రావూరు తాలూకాయే. కాని బాగా కష్టాని కలవాటు పడినరకం. ఒంటికి చొక్కాగానీ బనీయనుగానీ వేసికొనే అలవాటులేదు; పాలచెంగావి పంచలు ఎగగట్టుతాడు. గిరజా, జుట్టూవుంది. నల్లటి ముఖంమీద మంగళసూత్రమంత కుంకుమ బొట్టు పెట్టుకుంటాడు. పొగాకుకూ, ఆకూ వక్క, చుట్టలకే ఆయన బుజ్జమ్మనడిగి, లెక్కపుస్తకం అంగడికి పంపి, తెప్పించుకుంటాడు. ఆయన చిరుదిండి గణుసుగడ్డలు, వేరుశెనక్కాయలు, నీరుమజ్జిగా. పెళ్ళాంపేరిట వున్నా కోటిరెడ్డికి ఇరువయెకరా లున్నవి; యిద్దరే కూతుళ్ళు; యింట్లో వున్నది యైదుగురే; యెంతో మిగులుతుందికూడ. అయినప్పటికీ,పుట్టుకతో పుట్టిన బుద్ధి పనిచేయడం పొమ్మన్నా పోలేదు. పొద్దున్నే లేచి, వెన్నువిరిచి శ్రీకారం అరచేతిలో దిద్దుకుని, లేచి, పళ్ళుదోమి, విభూతి రేఖలు తీర్చి, దాని మీద కుంకుమ బొట్టు పెట్టి, జుట్టుకు వంటాముదం రాయించి తల దువ్వించుకుని, దోసిట చలిదన్నం తిని, లేపి, పావుగంటసేపు చుట్ట శుద్ధంగా పొరలు విప్పిచుట్టి,అంచుకొరికి రుచిచూసి, పాల డాలితుంచి నిప్పు తెప్పించి ముట్టించి, పన్నుకర్ర చంకను బెట్టి, మధ్యాహ్నానికి అన్నపుమూటను కర్రకు తగిలించుకుని, కర్ర భుజంమీద పెట్టి, పశువులను తోటలోకి తోలుకోపోవడం; తోట్లో కూచుని, పలుపులు పేని, యెద్దులకు సీళ్లు పెట్టి, పూరవేసిన గోగుకాడలు పెకలించి నారదీస్తూ, ఆపనీ యీపనీ చూసుకుంటూనే యానాది గుడిసెలోదూరి, సరపాలాడి, చక్కిలిగిలి పెట్టి, అణచిపెట్టినవన్నీ నాలుగురూపాయ లిచ్చి తీర్చుకుని, కూరసార బెట్టి నోరు మూసి లాభపడుతుంటాడు కోటయ్య. రాత్రులు కూడ కోటయ్యకు తోటే మకాము- హరికథ లక్కరలేదు. తోలుబొమ్మలాటయితే, దానిలోనూ కేతిగాడు, బంగారక్క, జుట్టుపోలుగాడు ఘట్టమయితే ఆయనకు నచ్చుతుంది. కూతుళ్లకు తండ్రిపోలికే లేదు. కనక, అప్పటి వరకూ గుసగుసలుగావున్న పుకారు నిజమని అందరూ అనుకున్నారు. వయస్సులో, మహా అయితే, బుజ్జమ్మకి ముప్ఫయ్యేళ్ళయితే, కోటిరెడ్డికి మరి పది యెక్కువ. కానీ బుజ్జమ్మ నిత్యం పెళ్లికూతురుమాదిరిగ నవనవలాడుతూ నిగనిగలాడుతుంది. వాయిల్ చీరెలు,బుంగజాకెట్లు మొట్టమొదట వూళ్ళోప్రవేశ పెట్టింది బుజ్జమ్మే; పసుపు పూసుకుంటే చాదస్తమంటుంది. ఎక్కువగా ఎవరితోనూ మాటాడదు; ఆమె నడుస్తుంటే,కాలి మట్టెలచప్పుడులో కలిసిపోతుంటవి- కిర్రుకారు యీలలు, యికయికలూ పకపకలూ. శంకరరెడ్డీ, యీమే ఒకసారి సాతమాలచ్చిమి యింటినుంచి వస్తూవుంటే యెవరో చూసినారట కాని కోటిరెడ్డి అంటీ అంటనట్లు ప్రవర్తించాడు. ఒంటిగా బండిలో నెల్లూరుకు ధర్మపత్ని సినిమాకు వెళ్ళి వచ్చే ధైర్యం వుంది బుజ్జమ్మకు-కాని అంతకు మునుపే శంకరయ్య నెల్లూరు చేరివుంటాడు.

ఈవేళ బుజ్జమ్మ వుభయం...

మొన్ననే గుడ్లుపెట్టి, నాలుగుగుడ్లు తను తాగి, మూడింటిని పొదిగి, కాళ్ళకింద ఒక పిల్లను తొక్కిచంపి, రెంటిని కృష్ణపక్షికి అప్పగించిన బెరస కోడిపెట్ట యీవేళ సగం హరిదాసు విస్తటిలో, మిరపపొడీ బర్రెనెయ్యితో పాటు భద్రంగా కడుపు యినప్పెట్టెలో చేరి గుడగుడ శబ్దాలు పొదిగింది.

హరికథ అవుతున్నంతసేపూ ఎల్లారెడ్డి చాల బాధ పడ్డాడు; పాపం బుజ్జమ్మ యేం చేస్తుంది? కథ పదిగంటలకే ముగించి వెళ్లాడు.

బుజ్జమ్మ గబగబా ముందు వెళ్ళి, రెడ్డిగారికి కమ్చీమంచమ్మీద బూరుగదూది పరుపువేసి, పరుపుమీద పూలదుప్పటి పరిచి, రెండు మెత్తటి దిండ్లు అమర్చి సపారంలో తను పడుకుంది. ముసలివాళ్లూ పిల్లలూ లోపల పడుకున్నారు.

ఎల్లారెడ్డికి పాపం రేచీకటి. నేరుగా సపారం లోకి దూరాడు. కింద మంచినీళ్ళ చెంబుకోసం చేత్తో తడివి, యెత్తి గుటగుటతాగి, మంచంమీద కూలబడ్డాడు. గుటగుట శబ్దానికే బుజ్జమ్మ నిదర నష్టమయింది. కాని లేస్తే బాగుండదనుకుని, నిదర పోతున్నట్టు శ్వాసవిడుస్తూ ఒళ్లు పులకరిస్తూ పరి పరి విధాలుగాపోతున్న బుజ్జమ్మ, ఎల్లారెడ్డిచెయ్యి చేతిమీద పడేసరికి మెల్లిగా'అమ్మో!'అంది.భయ పడిపోయి గబగబా లేచి నిలుచున్నా డెల్లారెడ్డి.

'చూళ్లేదమ్మా...'

'మీరా?'

'అవును, దొడ్లోకి పొయ్యొస్తూ నా మంచం యిదేమోనని వచ్చాను. పెటరమాక్సు లైటు వెల్తురునుంచి వొచ్చేతలికి కళ్లు మసకలు గమ్మి నట్లుండయి...పొరపాటు...'

బుజ్జమ్మ జాణ-మాట్లాడలేదు; అర్థవంతంగా మాత్రం నవ్వి, పైటతీసి మళ్ళీ వేసుకుంది. ఎల్లా రెడ్డి పోయాడు. బుజ్జమ్మకు యిక నిదర పట్ట లేదు. ఈమనిషి స్వభావమే అంత; ఒక ఆలో చన తడితేచాలు, దాని అంతు చూడాలంటుంది. అదీగాక నాలుగు రోజులనుంచి శంకరయ్య రావడంలేదు. అరుణాచలానికి రమణమహర్షి దర్శనానికి,బతిమలాడినా, వెళ్లాడు. అత నెందుకు పొయ్యిందీ తనకుమాత్రం తెలీదనుకున్నాడు. ఈ మధ్య కొత్తదారి తొక్కుతున్నాడని చిల కేటుగా తెలిసింది. కాంతమ్మ, వాళ్ళవాళ్ళంతా వెళితే, కాంతమ్మ చెంగుపట్టుకుని శంకరయ్య వెళ్ళాడు కాని, అరుణాచల రమణుడిమీద భక్తి చేతకాదు. భక్తి హరికథలు చెప్పే యీ ఎల్లా రెడ్డికిమాత్రం వుంటుందా? వీళ్ళకి ఆడవాళ్ళంటే మనసుండదూ? దొంగభక్తులు! సీతామ్మవారిని గురించి చెప్పేటప్పుడుకూడ తన మెప్పుకోస మన్నట్టు చూశాడు. అసలు కావాలనే తన మంచందగ్గరికి వచ్చాడేమో. పోతే మాత్రం వద్దంటాడా? ఏ మగవాడూ అనడు! కాకపోతే యెవరన్నా చూస్తారేమో అంటాడు.

* * *

హరికథ పూర్తి అయింది. ఊళ్లో వాళ్ళకి దిగులుపుట్టింది: రేపీవేళకి యీ కలకలమంతా వుండదు, దబూసిగా వుంటుంది.

హారతి వెలిగించి టెంకాయ కొట్టారు, మంగళం పాడారు. 'రామరామ రఘువీర పరాత్పర రాక్షససంహార రణధీరా...!' అని రామ సంకీర్తనం చేశారు. ట్రస్టీగారు పైకిలేచి, పూల మాలలో మెడల్ తగిలించి, ఆయన మెడలో వేసి, చప్పట్లు చరిచి, చరిపించి,ఆయనకు వందనం చేశాడు. హరిదాసు దీవించి, సభాసదుల కందరికీ వందనంచేసి యిలా అన్నారు:

'మీరు శ్రమ అనుకోకుండా యిన్నాళ్లూ వోపికగా,భక్తిగా యీ పావనసీతారామ చరిత్ర విన్నారు. సీతమ్మ యెంత పతివ్రత, యెంత సాధ్వి, యెంతయిల్లాలు, కష్టాలు ఓర్చుకోవడం, అన్నీ తెలుసుకున్నారు. తెలుసుకున్నందుకు ఫలం ఆచరించి చూపడం...' ఎవరో 'సీమొహం' అన్నారు. ఆడవాళ్లు చెంగు నోట్లో దోపి మరి నవ్వారు.

'పాపం, ఆయన మాత్రం తక్కువ కష్ట పడ్డాడా? నోరు చించుకుని చెప్పి,శరణోపాయం చూపి, ఆ పారవశ్యంలో కళ్ల నీళ్లు కార్చి, కష్ట పడినందుకు ఆయనకు నమస్కారంతప్ప మరేమీ యెక్కువ చేయలేము ...ఆయన సేవకు విలువ కట్టడం మానవమాత్రుడి వశంకాదు. కారణ మేమంటే, అది మానవుడికీ, భగవంతుడికీ సంబంధించిన విషయం...' అన్నారు ట్రస్టీగారు.

'పాడుముట్టుబొత! కోడిమాంసం మెక్కి కుక్కమాదిరి మోరిగినాడు. శని యిరగడైంది' అనుకున్నది పోతమ్మ.

'భక్తుడు!' అని ముసిముసిపోయింది బుజ్జమ్మ. ఎల్లారెడ్డికి ఆమాట వినేప్పుడు, గుండె పట్టుకుంది.

'శూద్ర—! అడుగడుగునా అపస్వరం, అసందర్భాలు, కల్పనలూ వాడూను! వీడికి హరికథలట! పనీపాటూ లేకుంటే సరి' అని విమర్శించారు గ్రామ మున్సబు వీరయ్యపంతులు. ఇంతకీ లోకం కాకిమూక!